## ఒకటవ తరగతి

# తెలుగు వాచకము




రంగనాయకమ్మ

# ఒకటవ తరగతి
# తెలుగు వాచకము

రంగనాయకమ్మ

స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

ఒకటవ తరగతి
తెలుగు వాచకము

పేజీలు : 64 (రాయల్ సైజులో)
ధర : 15 రూ.లు

ప్రచురణ కాలాలు :
2004 మార్చి నించీ,
2010 మార్చి వరకూ,
5 ముద్రణలు పడ్డాయి.
**6**వ ముద్రణ : **2011** మే

కంపోజింగ్ & పేజ్ మేకప్:
**ఎన్.ధనలక్ష్మి, ఎన్.రఘురామయ్య**

ముఖచిత్రం: **కరుణాకర్**

**పాఠాల్లో బొమ్మలు:**
కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు వాచకాల
సౌజన్యాలతో;
ఆ చిత్రకారులకు కృతజ్ఞతలతో.

ముద్రణ:
**దక్కన్ ప్రెస్**
1-19-1126/బి,
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 500 020

ప్రతులకు:
**అరుణా పబ్లిషింగ్ హౌస్**
ఏలూరు రోడ్డు
**విజయవాడ - 520 002.**
( ఫోన్: 0866 - 2431181 )

రంగనాయకమ్మ అడ్రసు:
76, లేక్-సైడ్ కాలనీ
( దుర్గం చెరువు దగ్గిర )
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# టీచర్లకు సూచనలు

**ఈ** విషయాలు, టీచర్లకు, బొత్తిగా తెలిసి వుండవని కాదు. చాలా విషయాలు తెలిసే వుంటాయి. అయినా కొందరు టీచర్లు, వీటిని మరిచిపోయి వుండవచ్చు. కొందరు, వీటి ప్రత్యేక తల్ని పట్టించుకోక పోవచ్చు. కొందరికి, ఈ విష యాలు అన్నీ తెలియక పోవచ్చు కూడా. వీటిని ఒక సారి గుర్తు చెయ్యడానికే ఈ ప్రయత్నం. టీచర్లు, దీన్ని అపార్థం చేసుకోకూడదు.

నేను 1991లో, **"తెలుగు నేర్పడం ఎలా?"** అనే పుస్తకం ఒకటి రాశాను. అది ఇప్పటికి **3** ముద్రణలు వచ్చింది. ఆ పుస్తకంలో చెప్పిందంతా, పిల్లలకు, ఒకటో తరగతిలో చదువు నేర్పే క్రమం గురించే. పిల్లలకే కాదు, చిన్నతనంలో చదువుకోని పెద్ద వాళ్ళకి అయినా, చదువుని నేర్పే ప్రారంభ క్రమం పిల్లల క్రమం లాగే వుండాలి.

50, 60 ఏళ్ళ నాటి ఒకటో తరగతి వాచకాల్ని తీసుకుంటే, వాటిలో కూడా కొన్ని పొరపాట్లు వున్నా, చదువు నేర్పే క్రమం అంతా వాటిలో సరైన పద్ధతి లోనే వుండేది. మొదట 'అక్షర మాల'ని చూపించి, తర్వాత మాటలూ, ఆ తర్వాత వాక్యాలూ చెప్పే క్రమం అది. 'మాటలు' నేర్పడంలో కూడా, ఒక్కొక్క పాఠంలో ఒక్కొక్క అచ్చు శబ్దాన్నీ, గుణింతం గుర్తుల్లో నించి ఒక్కొక్క గుర్తునీ, నేర్పుకుంటూ వెళ్ళే క్రమం అది. కానీ, క్రమ క్రమంగా ఆ సరైన పద్ధతికి బదులు, 'నూతనత్వం' పేరుతో, మొట్ట మొదటే కవిత్వాల్నీ, అందులో కొన్ని వాక్యాల్నీ చూపించి, ఆ వాక్యాల్లో వున్న అక్షరాలతో మాత్రమే వచ్చే మాటల్ని నేర్పే తప్పుడు పద్ధతి పుట్టుకొచ్చింది. అంతే కాదు, అక్షరాల్ని, వాటి ఆకారాల్ని బట్టి కొన్ని భాగాలుగా విభజించి, ఒక్కొక్క భాగంలోకి వచ్చే అక్షరాలతో మాత్రమే మాటలు చెప్పే వికృత పద్ధతి కూడా తలెత్తింది. — సరైన పద్ధతిని వదిలేస్తే, ఆ తర్వాత ప్రారంభించే ఏ పద్ధతి అయినా తప్పుడు పద్ధతే అవుతుంది. దాని వల్ల చదువు నేర్పడంలో అనేక సమస్యలు పుట్టు కొస్తాయి. అలాంటి విషయాలనే నేను, "తెలుగు నేర్పడం ......" పుస్తకంలో చాలా ఉదాహరణలు చూపిస్తూ చర్చించాను. రక రకాల తప్పుడు పద్ధతు లతో తయారైన అనేక **ఒకటో తరగతి వాచకాల** నించీనూ, **వయోజన వాచకాల** నించీనూ, ఆ ఉదాహరణలు ఇచ్చాను.

<u>అక్షరాలు అంటే అసలు అర్థం - శబ్దాలు.</u> ఆ శబ్దాల్ని చూపించే ఆకారాలే అక్షరాలు. అక్షరాలతో వ్యవహరించడం అంటే, వాటి ఆకారాల సంగతి గాక, శబ్దాల సంగతినే ప్రధాన విషయంగా తీసు కోవాలి. శబ్దాల్ని చూపించడంలో, తెలుగు 'అక్షర మాల'కు ఒక ప్రత్యేక లక్షణం వుంది. (ద్రావిడ భాషల అక్షర మాలలన్నిటికీ కూడా ఈ లక్షణం వుంది.) అదేమిటంటే, ఒకే రకం శబ్దంలో (ఉదా: **అ** - శబ్దంలో), పొట్టి శబ్దానికి ఒక అక్షరం **(అ)**, పొడుగు శబ్దానికి ఇంకో అక్షరం **(ఆ)** ఉంటాయి. **అ ఆ** - లు రెండూ పొట్టీ - పొడుగూ శబ్దాల జంట. అలాగే, తేలిక శబ్దానికి ఒక అక్షరం **(క)**, బరువు శబ్దానికి ఇంకో అక్షరం **(ఖ)** వుంటాయి. **క ఖ** - లు రెండూ తేలికా - బరువూ శబ్దాల జంట. ఈ రకంగా, ఒకే రకం శబ్దంలో పొట్టీ - పొడుగూ, తేలికా - బరువూ తేడాల కోసం వేరు వేరు అక్షరాలు వుండే పద్ధతి, యూరోపియన్ భాషల్లో వుండదు.

ఇక్కడ 'తెలుగు' విషయమే తీసుకుంటే, ఇందులో, అచ్చుల్లోనూ హల్లుల్లోనూ కూడా చాలా అక్షరాలు జంటలు జంటలుగా వుంటాయి. అంతే కాదు, హల్లుల్లో వుండే **క చ ట త ప** - లు గానీ, **య ర ల వ** - లు గానీ, ఇప్పుడు వున్న వరసల్లోనే వుండడానికి కూడా సరైన కారణాలు వున్నాయి. **క** - వరసలో వుండే **క, ఖ, గ, ఘ** - లు నోటిలో దాదాపు ఒకే స్థానం నించి వచ్చే శబ్దాలు. అలాగే **చ** - వరసలో వుండే **చ ఛ, జ ఝ** లు నోటిలో ఒకే స్థానం నించి పుట్టే శబ్దాలు. అలాగే మిగిలిన వరసలు కూడా. అంటే, తెలుగు అక్షర మాలలో, రెండేసి అక్ష రాలు ఒక జంటగా వుండడానికి గానీ, కొన్ని అక్ష రాలు కలిసి ఒక వరసలో వుండడానికి గానీ, శబ్దాల మీద ఆధారపడ్డ కారణాలు వున్నాయన్న మాట!

అలాంటి అక్షరాల్లో నించి ఒక జంటని (ఉదా: **అ ఆ** - ల జంటని) విడదీస్తే, పొట్టి శబ్దం ఒక చోటుకీ, పొడుగు శబ్దం ఇంకో చోటుకీ పోతాయి. అలాగే హల్లుల్లో జంటల్ని (**క ఖ** - ల్ని) విడదీస్తే తేలిక శబ్దం ఒక చోటుకీ, బరువు శబ్దం ఇంకో చోటుకీ

పోయి పడతాయి. అప్పుడేం జరుగుతుందంటే, పొట్టి శబ్దం తెలియక ముందే పొడుగు శబ్దాన్ని చదవ డమూ; తేలిక శబ్దం తెలియకుండానే బరువు శబ్దాన్ని చదవడమూ - లాంటి సమస్యలు పుట్టుకొస్తాయి. **'రూప సామ్య పద్ధతి'**లో పాఠాలు రాసిన వాచకాల్లో ఇలాంటి వికృతాలు చెప్పలేనన్ని జరిగాయి.

అలాగే, మొదటే వాక్యాన్ని చూపించి అందులో వున్న అక్షరాలతో మాత్రమే మాటలు చెప్పే రకం వాచకాల్లో కూడా చాలా వికృతాలు జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు వున్న **'తెలుగు భారతి'** లాంటి వాచకం గానీ, కొన్ని ప్రైవేటు వాచకాలు గానీ, 'కొత్తదనాల' పేరుతో, అనేక తప్పుడు పద్ధతు లతో కిక్కిరిసి పోయి వున్నాయి. ఈ రకంగా, తప్పు పద్ధతులతో వున్న వాచకాలు, చిన్న పిల్లలకు చదువులు నేర్పడానికి ఉపయోగ పడవు.

కాబట్టి ఇప్పుడు మనం చేసుకోవలిసిన మంచి మార్పు ఏమిటంటే, మళ్ళీ వెనకటి మంచి పద్ధతు లనే అనుసరించడం. వెనకటి వాచకాల్లో పొరపాటు అంశాలేమిటో అర్థం చేసుకుని, వాటిని వదిలేసి, మంచి అంశాలన్నిటినీ నిలబెట్టుకోవాలి. ఏది సరైన దైతే అదే మంచిది. సరైన దాన్ని ఇక మార్చ నక్కర లేదు. సరైన దాన్ని ఏ మాత్రం మార్చినా అది మళ్ళీ సరికాని విధానం అయి పోతుంది. అప్పుడు మళ్ళీ సమస్యలు ప్రారంభమవుతాయి. అప్పుడైనా సరైన దాని దగ్గిరికి వెళ్ళవలసి వస్తుంది. కాబట్టి, సమస్యల నించి బైట పడాలంటే, సరైన క్రమాన్ని గుర్తించి, దాన్ని నిలబెట్టు కోవడమే మనం చెయ్యవలసిం దంతా. అక్షరాలు అంటే శబ్దాలు - అనే విషయం మొట్ట మొదట దృష్టిలో పెట్టుకోవాలి. తెలుగు అక్షర మాలలో అక్షరాలు, జంటలుగా ఎందుకు వున్నాయో, ఆ జంటల్ని విడదీసే పద్ధతులు తెచ్చి పెడితే ఏం జరుగుతుందో, అర్థం చేసుకోవాలి.

ఒకటో తరగతి కోసం ఎవరు ఏ వాచకం రాసినా, **'అక్షరాలూ - మాటలూ - వాక్యాలూ'** క్రమాన్ని అనుసరిస్తే ఏ సమస్యా తలెత్తదు. అలాంటి సరైన క్రమంతో ఒక్క వాచకమే వుండాలనే రూలు వుండదు. ఎన్ని వాచకాలైనా వుండవచ్చు. ఎందు కంటే సరైన క్రమంతో ఇద్దరు రచయితలు వేరు వేరు వాచకాలు రాస్తే, ఆ ఇద్దరూ, ప్రతీ పాఠాన్నీ ఒకే రకంగా రాయరు. ప్రతీ పాఠం లోనూ ఒకే మాటలూ, ఒకే వాక్యాలూ ఇవ్వరు. తర్వాత ఒకే పాటలూ, కథలూ ఇవ్వరు. ఎవరు ఇచ్చేది వాళ్ళు ఇస్తారు. ఒక వాచకంలో **4** కథలు చదివే విద్యార్థులు, ఇంకో వాచకంలో ఇంకో **4** కథలు చదువుతారు. లేదా, కొందరు పిల్లలు - ఈ వాచకం చదివితే, కొందరు పిల్లలు - ఆ వాచకం చదువుతారు. ఒక్క వాచకమే వుండాలనే రూలేమీ లేదు. అసలు జరగవలసిన విషయం - శబ్దాల్ని నేర్పడం. దాని కోసం సరైన క్రమాన్ని నిర్ణయించు కోవాలి. మన పిల్లలకు మనం చేసుకోవలిసిన మేలు అదే.

**ఈ వాచకం రాయడంలో నేను పాటించిన పద్ధతి ఏమిటంటే: (1)** 'అక్షర మాల'లో నించి కొన్ని అనవసరపు అక్షరాల్ని వదిలి వెయ్యడమూ, **(2)** మొట్ట మొదటే అన్ని రకాల శబ్దాల మాటల్నీ ఇచ్చే పద్ధతిని వదిలి వెయ్యడమూ, **(3)** వెనకటి మంచి వాచకాల్లో, పాఠాలు ఇవ్వడంలో వున్న సరైన క్రమాన్ని అనుసరించడమూనూ. - ఇంత కన్నా నేను కొత్తగా చేసిందేమీ లేదు.

**విద్యార్థులకు చదువు నేర్పేది టీచర్లే కాబట్టి, టీచర్లు ఈ సూచనలు గమనించాలి:**

**1.** ఈ వాచకంలో, ప్రారంభంలో, 'జాతీయ గీతాలు' గానీ, 'ప్రతిజ్ఞలు' గానీ, ఇతర పాటలు గానీ, ఏమీ ఇవ్వలేదు. ఎందుకంటే, అవి ప్రారంభంలోనే వుంటే, వాటిని పిల్లలు చదవ లేరు. 'వాచకం' అనేది పిల్లల కోసం. వాచ కంలో పేజీలన్నీ పిల్లలు నేర్చుకోవలిసిన పాఠాల్ని ఇచ్చే క్రమం లోనే వుండాలి. కాబట్టి, ప్రారంభం లోనే ఏ పాటలూ పెట్ట లేదు.

**2.** 'ప్రతిజ్ఞ' లాంటి వాటిని చివరి పేజీల్లో కూడా పెట్టలేదు. ఎందుకంటే, పిల్లలతో ప్రతిజ్ఞలూ ప్రమాణాలూ చేయించడం అంటే, అది 'ఒట్లు పెట్టించడం' లాంటిదే. అది, పిల్లలు తెలిసి చేసే పని అవదు. వాళ్ళకు తెలియని పని ని వాళ్ళతో చేయించకూడదు. కాబట్టి, అలాంటి వాటిని వాచకంలో ఎక్కడా పెట్టలేదు. దీన్ని టీచర్లు అర్థం చేసుకోవాలి.

**3.** కొన్ని పాఠాల్లో, పేజీ కి అడుగు భాగంలో, **"టీచర్లకు సూచన"** అనేది వుంటుంది. ఆ పాఠం దగ్గిర టీచరు ప్రత్యేకంగా ఏ విషయాలు గుర్తు పెట్టుకోవాలో ఆ సూచన చెపుతుంది. అది టీచరు కోసమే. పిల్లల కోసం కాదు. ఆ భాగాన్ని పిల్లలకు చూపించి, "పేజీల్లో అడు

గున ఇలా వున్నవన్నీ మీ కోసం కాదు. టీచర్ల కోసం. కాబట్టి వీటిని మీరు పట్టించుకోవద్దు. పై భాగంలో వున్న మీ పాఠాలనే మీరు చదువుకోవాలి'' అని చెప్పాలి.

4. పిల్లలు బడికి రాగానే వాళ్ళతో టీచరు, ప్రార్థనలు చేయిస్తారో, వేరే పాటలు పాడిస్తారో, ఆటలు ఆడిస్తారో, అదంతా టీచరు ఇష్టం. ఆ విషయాలతో ఈ పాఠాలకు సంబంధం వుండదు. ఇందులో మొట్ట మొదటి పాఠం 'అక్షర మాల'ని చూపించడం. దీని తోటే చదువు నేర్పే క్రమం ప్రారంభమవుతుంది. టీచరే ఆ అక్షరాలన్నీ చదివి వినిపించడమూ, పిల్లలతో కూడా పలికించడమూ, ఆ మర్నాటి నించీ అక్షరాలన్నీ బోర్డు మీద రాసి చూపించడమూ, ఇలా మళ్ళీ మళ్ళీ చెయ్యాలి. **2, 3** రోజుల్లోనే చిన్న చిన్న మాటలు రాసి చూపించాలి.

5. అక్షరాలూ, అక్షర మాలా, అచ్చులూ, హల్లులూ - అనే మాటలు చెప్పడం ప్రారంభించాలి. 'అక్షర మాల'లో, ఆ భాగాల్ని చూపిస్తూ చెప్పాలి. " పైన వున్న అక్షరాల పేరేమిటి? కింద వున్న అక్షరాల పేరేమిటి?'' అని ప్రశ్నిస్తూ పిల్లలతో జవాబులు చెప్పించాలి. ప్రతీ పాఠం లోనూ పిల్లల్ని ప్రశ్నిస్తూ, ఆ జవాబులన్నీ మొదట టీచరే చెప్పి, పిల్లలు ఆ జవాబులే చెప్పగలిగే లాగ చెయ్యాలి.

6. 'అక్షర మాల'లో కొన్ని అక్షరాలు జంటలుగా వుంటాయనీ, కొన్ని అక్షరాలు విడి విడిగా వుంటాయనీ, ఆ జంటల్నీ, ఆ విడి అక్షరాల్నీ చూపిస్తూ చెప్పాలి.

7. మాటల పాఠాలు మొదలయ్యాక, **అ** - శబ్దం పాఠంలో 'తల కట్టు' పేరు చెప్పి దాన్ని చూపిస్తాం. అప్పుడు మొత్తం 'అక్షర మాల'ని చూపించి, అందులో ఏ యే అక్షరాలకు తల కట్లు వున్నాయో, ఏ యే అక్షరాలకు లేవో పిల్లలు చెప్పగలిగే లాగ వాళ్ళని ప్రశ్నిస్తూ జవాబులు చెప్పించాలి.

8. **ఆ** - శబ్దం పాఠంలో, **ఆ** - దీర్ఘం గల కొత్త అక్షరాలు ప్రారంభమవుతాయి. ఆ కొత్త అక్షరాల్ని పిల్లలు గమనించే లాగ చెయ్యాలి. **చా ప** - అనే మాటలో, **ప** - పాత అక్షరమే గానీ, **చా** - కొత్తది. అది 'అక్షర మాల'లో లేనిది. ప్రతీ మాటలోనూ ఒక కొత్త అక్షరం వుంటుంది. దాన్ని పిల్లలు చెప్పగలిగే లాగ ప్రశ్నిస్తూ జవాబులు చెప్పించాలి.

9. **ఔ** - పాఠం వరకూ, కొత్త అక్షరాలూ, కొత్త గుర్తులూ వస్తూ వుంటాయి. వాటిని విద్యార్థులు గమనించే లాగ, వాళ్ళని ప్రశ్నిస్తూ జవాబులు చెప్పించాలి.

10. ఈ వాచకం లో, వాక్యం - అనేది, మాటలు ప్రారంభమైన మొట్ట మొదటి పాఠం నించీ కూడా వుంది. ప్రతీ పాఠం లోనూ చివర్లో వాక్యాలు వున్నాయి. కానీ, వాటి చివర ఫుల్ స్టాపులు లేవు. ఎందుకంటే, పిల్లలకు, 'మాట' అంటే ఏమిటో, 'వాక్యం' అంటే ఏమిటో తెలిస్తే తప్ప, ఆ చుక్కలు ఎక్కడ వుండాలో, ఎందుకు వుండాలో, అర్థం చేసుకోలేరు. కారణం తెలియకుండా అక్కడక్కడా చుక్కల్ని చూస్తే, మాటల పక్కన కూడా చుక్కలు పెట్టాలను కుంటారు. కాబట్టి, వాక్యాల చివర చుక్కలు పెట్టలేదు. పాఠాలు చదివించేటప్పుడే : " ఇది మాట. ఇది వాక్యం'' అని మాటల్నీ వాక్యాల్నీ చూపించాలి.

11. చదువు నేర్పడంలో, సంయుక్తాక్షరాల పాఠం వరకూ ఒక క్రమం వుంటుంది. ఆ క్రమంలో తేలిగ్గానే వెళ్ళవచ్చు. ప్రతీ పాఠం లోనూ, అక్కడేం నేర్చుకోవాలో పిల్లలకు వివరించడమూ, తర్వాత ప్రశ్నించడమూ, పిల్లలతో ఆ జవాబులు చెప్పించడమూ - ఈ క్రమాన్ని ఏ పాఠం లోనూ మానకూడదు. ఇది ఏమీ కష్టం కాదు. చదువు చెప్పడం ఎలాగూ తప్పదు. ఆ చెప్పే దాన్ని, విద్యార్థులకు అర్థమయ్యేటట్టు చెప్పాలనేదే దీని సారాంశం అంతా.

12. **ఞ** అనే అక్షరాన్ని ' అక్షర మాల'లో చూపించక పోయినా, ఈ వాచకంలోనే 5 వ కథలో, **అజ్ఞాని, జ్ఞానులు** అనే మాటల్లో **జ్ఞ** ని వాడాను. **జ్ఞ** లో వున్న **ఞ** అక్షరం పిల్లలకు ఎలా తెలుస్తుందనే సందేహం వస్తుంది. దీని గురించి గతంలో వివరణ ఇవ్వలేదు. గ్న్య అనే సంయుక్తాక్షరానికి ఇంకో రూపమే **జ్ఞ**. రెంటి లోనూ శబ్దాలు ఒకటే. కాబట్టి, ఎవరు ఎలా రాసినా ఒకటేనని పిల్లలకు వివరించాలి.

13. చివరగా టీచర్లకు నా అభ్యర్థన ఏమిటంటే, **" తెలుగు నేర్పడం ఎలా ?"** పుస్తకాన్ని ఒక సారి చూడమని. అది, వారి పని ని ఎంతోకొంత తేలిక చేస్తుందని నా అభిప్రాయం.

**ఈ వాచకంలో మొట్టమొదటి పాఠం, అక్షర మాల ని చూపించడంతో ప్రారంభమవుతుంది.**

రంగనాయకమ్మ

అ ఆ    ఇ ఈ    ఉ ఊ

ఎ ఏ ఐ   ఒ ఓ ఔ   అం   అః

---

క   ఖ   గ   ఘ

చ   ఛ   జ   ఝ

ట   ఠ   డ   ఢ   ణ

త   థ   ద   ధ   న

ప   ఫ   బ   భ   మ

య   ర   ల   వ

శ   ష   స   హ   ళ

**టీచర్లకు సూచన:** విద్యార్థులకు మొదట 'అక్షర మాల' ని పరిచయం చెయ్యాలి. "ఇది అక్షర మాల. పై అక్షరాల పేరు **అచ్చులు**. కింది అక్షరాల పేరు **హల్లులు**" అంటూ, ఆ భాగాల్ని చూపిస్తూ ఆ పేర్లని విద్యార్థులకు మళ్ళీ మళ్ళీ చెప్పాలి. ఈ అక్షరాలన్నీ కొన్ని సార్లు చదివి వినిపించాలి. విద్యార్థులతో కూడా పలికించాలి. ఒక సారి పలికించడానికి **2** నిమిషాల కన్నా ఎక్కువ సేపు పట్టదు. ★

| | |
|---|---|
| అ ఆ | క గ |
| ఇ ఈ | చ జ |
| ఉ ఊ | ట డ ణ |
| ఎ ఏ ఐ | త ద న |
| ఒ ఓ ఔ | ప బ మ |
| అం అః | య ర ల వ |
| | శ ష స హ ళ |

**టీచర్లకు సూచన:** హల్లుల్లో వుండే ఒత్తు అక్షరాలతో మొదట్లో అవసరం లేదనీ, అందుకే వాటిని ఇక్కడ వదిలి వేశామనీ విద్యార్థులకు చెప్పి, ఆ వదిలి వేసిన **10** అక్షరాల్నీ 'అక్షర మాల'లో చూపించాలి. ఈ అచ్చుల్లోనూ, హల్లుల్లోనూ, ఏ యే అక్షరాలు జంటలుగా వున్నాయో, ఏ అక్షరాలు విడి అక్షరాలుగా వున్నాయో, విద్యార్థులకు 'అక్షర మాల'లో చూపిస్తూ, మళ్ళీ మళ్ళీ చెప్పాలి.

★

# త ల



# వ ల



# ప ల క



# ప డ వ



# క డ వ



---

**టీచర్లకు సూచన:** ‘అక్షర మాల’ని చూపించి, ఆ అక్షరాలన్నీ చదివి వినిపిస్తూ, వాటిని విద్యార్థులతో పలికిస్తూ, వాటిని బోర్డు మీద రాసి చూపిస్తూ, ఈ పనులన్నీ జరుగుతూ వున్నప్పుడు, ఆ అక్షరాలతో చిన్న చిన్న మాటలు కూడా మధ్య మధ్యలో రాసి చూపించాలి. ఉదా: ‘అక్షర మాల’లో, **త** - నీ, **ల** - నీ చూపించి, “ఈ 2 అక్షరాల్నీ ఒక చోట పెడితే అది ఒక మాట అవుతుంది చూడండి” అని చెపుతూ, ఆ అక్షరాల్ని బోర్డు మీద రాసి చూపించాలి. అలాగే, ఇంకో 2 అక్షరాల్ని చూపించి ఇంకో మాట. **ఆ** - తో **ఆవు** - అనే మాట రాయకూడదు. ‘అక్షర మాల’లో **వ** - వుంటుంది గానీ, **వు** - వుండదు. **వు** - ని చూపిస్తే విద్యార్థులకు ఈ దశలో తెలియదు. అలాగే →

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1019**

* * *

**Read other books of Ranganayakamma @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=181**